## కాంగ్రెస్, బీఆర్ఎస్‌వి రాజకీయాలు

**ఘట్‌కేసర్:** రోడ్డు విస్తరణ బాధితులకు నష్టపరిహారం చెల్లించకుండా అధికారంలో ఉన్న కాంగ్రెస్, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం జాప్యం చేస్తూ ప్రస్తుతం రాజకీయాలు నడుపుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. కమీషన్ల కోసం వంతెన కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇప్పించడం లేదని, తమ అసమర్థతను కప్పి పుచ్చుకోవడానికి బీజేపీని విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు 2013 నూతన భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరలకు మూడు రెట్ల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల కోసం పోరాడే ఏకైక పార్టీ బీజేపీనే అని అన్నారు.

## రాజ్యాంగంలో మహిళలకు సమాన హక్కులు



**ఘట్‌కేసర్:** రాజ్యాంగంలో మహిళలకు అంబేడ్కర్ సమాన హక్కులు కల్పించారని విజిలెన్స్ క్రైమ్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. అంబేడ్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. కార్యక్రమంలో దాసు, బాల్‌రాజ్, నర్సింగ్‌రావు, నారాయణ, శ్రీనివాస్, రాజేష్ కుమార్, సత్యం, అంజయ్య, వెంకటేశ్వర్‌రావు, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నియామకం



నియామకపత్రం అందుకుంటున్న భానుచందర్

**మేడ్చల్‌రూరల్:** గుండ్లపోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షులుగా భానుచందర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం భానుచందర్‌కు ఎస్సీసెల్ జిల్లా చైర్మన్ పత్తి కుమార్, ఏ బ్లాక్ అధ్యక్షులు మహేష్ నియామకపత్రాన్ని అందజేశారు.

## ఘనంగా అంబేడ్కర్ జ్ఞానమాల




**కీసర:** అంబేడ్కర్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని బంగారు మైసమ్మదేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. ఆదివారం కీసరలో అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పణ కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ముసుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుంశ్రీనివాస్, బంగారు మైసమ్మ ఆలయ చైర్మన్ తుడుం యాదగిరి, నేతలు కుమార్, సుధాకర్, వేణుగోపాల్, ఆంజనేయులు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్యుఫేయిర్ నమూనా ప్రదర్శన

**బోడుప్పల్:** శుభోదయకాలనీలోని బచపన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఎడ్యుఫేయిర్ నమూనాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా పాఠశాల డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల ఆచార, వ్యవహారాలు, వేషభాషలు, సంస్కృతి, సంప్రదాయాల గురించి విద్యార్థులు తయారు చేసిన నమూనాలు కనువిందు చేశాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరితా విలియమ్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని రసాయనం తాగి వ్యక్తి మృతి



హరినాథ్ (ఫైల్)

**జవహర్‌నగర్:** గుర్తు తెలియని రసాయన మందు తాగి వ్యక్తి మృతిచెందిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్ భగత్‌సింగ్‌నగర్ కాలనీలో నివసించే జగపతి హరినాథ్ (55) గ్రీన్‌పార్క్ అపార్టుమెంట్స్ వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ భార్య చంద్రకళతో కలిసి ఉంటున్నారు. హరినాథ్‌కి మద్యం తాగే అలవాటు ఉండటంతో ఈ నెల 21న విధులకు వెళ్లకుండా మద్యం తాగి ఇంట్లోనే పడుకున్నారు. అయితే మద్యం మత్తులో ఉన్న హరినాథ్ అర్ధరాత్రి లేచి ఇంట్లోకి వెళ్లి నీరు తాగుదామని అక్కడే ఉన్న గుర్తు తెలియని రసాయన మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆదివారం హరినాథ్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆమోదం లభిస్తేనే 'ఇల్లు'

- అర్హుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీ కీలకం
- ప్రజాపాలన దరఖాస్తుల ప్రామాణికంగా కొనసాగుతున్న సర్వే
- నెలాఖరు వరకు పూర్తి చేసేందుకు చర్యలు



**సాక్షి,సిటీబ్యూరో:** ఇందిరమ్మ ఇళ్ల అర్హులకు సంబంధించి ఇందిరమ్మ కమిటీలు కీలకంగా వ్యవహరించనున్నాయి. ఈ కమిటీ ఆమోద ముద్ర వేస్తేనే ఇళ్లు మంజూరు అవుతాయి. ఈ నేపథ్యంలోనే అర్హులైన ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌తో నగర శివారులోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో సంబంధిత సిబ్బంది సర్వే కార్యక్రమాన్ని చేపడుతోంది. పంచాయతీల్లో గ్రామ కార్యదర్శులు, మున్సిపాలిటీలు, పురపాలక సంఘాలలోని వార్డులు/డివిజన్లలో వార్డు ఆఫీసర్లు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాల్సి ఉంటోంది. మొదటి దశలో అత్యంత పేదలను గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని సర్కారు భావిస్తోంది.

**ప్రజా పాలన దరఖాస్తులే ప్రామాణికం...**

కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది డిసెంబరు 26 నుంచి జనవరి 6 వరకు ప్రజల నుంచి ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరించింది. ఈ దరఖాస్తుల ఆధారంగానే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసుకున్నారు. దరఖాస్తుల వివరాలను అధికారులు ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పురపాలక సంఘాల్లో ఇళ్లు లేని వారి వివరాలు వార్డులు/డివిజన్ల వారీగా కనిపిస్తాయి. వీటి ఆధారంగా సర్వే బృందాలు క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నారు. ఇళ్లు లేని వ్యక్తుల పూర్తి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటోంది.

**ఇందిరమ్మ కమిటీ కీలకం...**

ఇళ్ల సర్వే అనంతరం వెల్లడైన జాబితాను ఆయా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పురపాలక సంఘాల్లోని వార్డులు/డివిజన్ల పరిధిలోని ఇందిరమ్మ కమిటీలకు అందజేస్తారు. కమిటీ సభ్యులు జాబితాలో ఉన్న వారి పేర్లను పరిశీలించి వారు అర్హులా? కాదా? అని నిర్ణయిస్తారు. కమిటీ ఆమోదించిన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తారు. ఇందులో సొంత స్థలం ఉండి అసలే ఇళ్లులేని పేదలకు తొలి ప్రాధాన్యం ఇస్తారు. స్థలాలు లేని వారికి ప్రభుత్వం స్థలాలు కొనుగోలు చేసిన తర్వాత మరోసారి అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు వివిధ దశల్లో అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**శామీర్‌పేట్:** ప్రతీ పేదవాడికి నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ అన్నారు. శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేట గ్రామానికి చెందిన బాలేష్‌కు మంజూరైన రూ. 60 వేలు, మూడుచింతలపల్లి మండలం, జగ్గంగూడకు చెందిన జగదీశ్వర్‌కు రూ. 39 వేల సీఎం సహాయనిధి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, మహేందర్ యాదవ్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## అభినందనలు



ప్రసన్నకుమారిని అభినందిస్తున్న వజ్రేష్‌యాదవ్

**మేడ్చల్:** మేడ్చల్‌కు చెందిన యువ క్రీడాకారిణి జాతీయ స్థాయి త్రోబాల్ ఆటలో రాణిస్తుండటంతో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆమెను అభినందించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్ ఆధ్వర్యంలో త్రోబాల్ క్రీడాకారిని కత్తి ప్రసన్నకుమారిని అభినందిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో వజ్రేష్‌యాదవ్ పాల్గొని ఆమెకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బోడుప్పల్ మేయర్ అజయ్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

**కీసర:** ఎస్ఎఫ్‌సీ ముదిరాజ్ సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం చీర్యాల్‌లో ఎస్ఎఫ్‌సీ ముదిరాజ్ సంఘం వ్యవస్థాపకులు రవీంద్రబాబు, శ్యామ్‌రావు, యాదగిరిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో సుమారు 50 లక్షల మంది ముదిరాజ్‌లు ఉన్నా విద్య, ఉద్యోగ, ఆర్థికంగా ఇప్పటికే వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లను ప్రోత్సహించాల్సిన బాధ్యత తోటి ముదిరాజ్‌లుగా అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ రమేష్‌కుమార్, వైస్‌చైర్మన్ ఈశ్వరయ్య, అధ్యక్షులు రవీందర్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షులు సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కృష్ణ, శివకుమార్, గోపాల్, సహాయ కార్యదర్శులు నవీన్‌కుమార్, హంస, శ్రీహరి, కార్యనిర్వాహక కార్యదర్శులు శ్రీనివాస్, శివకుమార్, సూరిబాబు, కోశాధికారి వెంకటేష్, సలహాదారులు భాగ్యరేఖ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



### డ్రగ్ కంట్రోల్ అధికారుల
## ఆకస్మిక దాడులు



సీజ్ చేస్తున్న డ్రగ్స్

**శామీర్‌పేట్:** లైసెన్స్ లేకుండా ఓ ఆర్ఎంపీ క్లినిక్‌పై మేడ్చల్ డ్రగ్ కంట్రోల్ అధికారులు శనివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మండలకేంద్రంలోని స్వప్న క్లినిక్‌లో లైసెన్స్ లేకుండా భారీగా డ్రగ్స్ (ఔషధాలు) నిల్వ ఉంచారన్న విశ్వసనీయ సమాచారంతో డ్రగ్ కంట్రోల్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు 50 రకాల యాంటీబయోటిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు. డబ్బుకు ఆశపడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న స్వప్న క్లినిక్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కూటి కోసం.. కూలీ కోసం



ప్రమాదపు అంచున ప్రయాణిస్తున్న మహిళా కూలీలు

**మేడ్చల్‌రూరల్:** కూటి కోసం.. కూలీ కోసం ప్రమాదం అంచున కూర్చొని ప్రయాణం సాగిస్తున్న మహిళా కూలీలు 'సాక్షి' కెమెరాకు చిక్కారు. ఆదివారం సాయంత్రం పూడూర్–శామీర్‌పేట్ రోడ్డులో శామీర్‌పేట్ వైపు వెళ్తున్న ట్రాక్టర్‌లో ఈ దృశ్యం కనిపించింది. ట్రాక్టర్ ఇంజన్ పక్కన మధ్యలోని టైర్లకు సమీపంలో ఓ వైపు వృద్ధురాలు, మరోవైపు మరికొందరు మహిళలు ప్రమాదకరంగా కూర్చొని ప్రయాణం సాగిస్తున్నారు. వ్యవసాయానికి ఉపయోగపడే ట్రాక్టర్‌పై మహిళలు ప్రయాణించడమే ప్రమాదకరం, అందులోనూ ట్రాక్టర్ చివర్లో కూర్చొని ప్రయాణించడాన్ని ఆ రోడ్డుపై వెళ్లే ఇతర ప్రయాణికులు చూసి భయాందోళనకు గురయ్యారు. పూట గడవడానికి డబ్బు ఎంత అవసరమో.. ఆ డబ్బు సంపాదించడానికి ప్రాణాలతో ఉండడం అంతకంటే ముఖ్యమని ఇతర ప్రయాణికులు వాపోతున్నారు.

## రైల్వే వంతెన బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలంటూ వినతి



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూబాధితులు

**ఘట్‌కేసర్:** పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్యకు బాధితులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. గతంలో చేపట్టిన రోడ్డు విస్తరణలోను బాధితులకు నష్టపరిహారం చెల్లించలేదని, నూతన చట్టం ప్రకారం మార్కెట్ రేటుకు మూడింతలు చెల్లించాలని లేఖలో కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లేష్, జంగయ్యయాదవ్, బాధితులు పాల్గొన్నారు.

## ముగిసిన మేనేజ్‌మెంట్ ఫెస్ట్



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అధ్యాపకులు

**మేడ్చల్‌రూరల్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సెట్ ఎంబీఏలో రెండు రోజుల పాటు సాగిన మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ఆదివారం ముగిసింది. ఫెస్ట్‌లో భాగంగా విద్యార్థులు పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, ఎంబీఏ డీన్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసిన, శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వేణగోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నవభారత్ యువజన సంఘం ఎన్నికలు



**పోచారం:** ప్రతాపసింగారం నవభారత్ యువజన సంఘం నూతన కమిటీని ఆదివారం గ్రామంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీశైలం, కాసిం, ప్రధాన కార్యదర్శిగా సాయిబాబా, కార్యదర్శులుగా సాయికిరణ్, గోపి, కోశాధికారిగా ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివశంకర్, యూత్ మాజీ అధ్యక్షుడు దర్శన్, ప్రభాకర్, కుమార్, సుధాకర్, మధు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం



యాదగిరి

**జవహర్‌నగర్:** మార్నింగ్ వాక్‌కి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ గబ్బిలాల్‌పేటలో నివసించే కానుగంటి యాదగిరి (70) రైల్వే విశ్రాంత ఉద్యోగి. ఈ నెల 21న ఉదయం వాకింగ్‌కు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. యాదగిరి ఆచూకీ కోసం తెలిసిన చోట్ల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆయన కుమారుడు శ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## శివాలయం అభివృద్ధికి రూ. 50 లక్షలు మంజూరు

**శామీర్‌పేట్:** మేడ్చల్ జిల్లా, ఉద్దమర్రి శ్రీ విష్ణు శివాలయ అభివృద్ధికి దేవాదాయ ధర్మాదాయ శాఖ రూ. 50 లక్షల నిధులను మంజూరు చేసిందని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్ తెలిపారు. ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ విచ్చేసిన సందర్భంలో నిధులు కేటాయించేందుకు సహకరించాలని కోరామని గుర్తు చేశారు. అనతి కాలంలోనే ప్రభుత్వం రూ. 50 లక్షల నిధులు మంజూరు చేసిందని, ఇందుకు సహకరించిన వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో ఆలయ రాజగోపురం, నీరాలి మండలం, పుష్కరఘాట్‌లను నిర్మించి భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామని ఆలయ చైర్మన్ ఉమామహేశ్వరి తెలిపారు. ఈ సమావేశంలో మాజీసర్పంచ్ వెంకటేష్, బాల్‌నర్సింహా, డైరెక్టర్లు రవీందర్‌గౌడ్, రాజిరెడ్డి, రమేష్, నాయుకులు విష్ణుగౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌చారి, ఆలయ అర్చకులు వెంకయ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



అంగన్‌వాడీ భవనంను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, నాయకులు

**మేడ్చల్:** పట్టణంలోని 14వ వార్డులో దాతల సహకారంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనంను మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మేడ్చల్‌కు చెందిన కరణం పంతులు కుమారులు స్థలం విరాళంగా ఇవ్వగా.. కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి తన స్వంత ఖర్చులతో అంగన్‌వాడీ భవనం నిర్మించారు. ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి భవనంను ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, గణేష్, నవీన్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ హైమావతి, కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కుమార్, సత్తిరెడ్డి, దాతలు కిషన్‌రావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా విభాగంలో క్రికెటర్ నల్ల క్రాంతిరెడ్డి



**కీసర :** కీసరకు చెందిన నల్ల కాంత్రిరెడ్డి మహిళా విభాగం క్రికెట్‌లో రాణిస్తుండటం పట్ల కుటుంబ సభ్యులతోపాటు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్నప్పటి నుంచి క్రికెట్‌పట్ల ఆసక్తితో ముందుకెళ్తున్న నల్ల క్రాంతిరెడ్డి ప్రస్తుతం డిగ్రీ చదువుతూ క్రికెట్‌లో రాణిస్తోంది. క్రికెట్ పై ఆసక్తితో 2015 నుంచి వనస్థలిపురంలోని శివాజీ క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకుంటూ క్రికెట్‌లో మంచి ప్లేయర్‌గా రాణిస్తోంది. ఇప్పటి వరకు హైదరాబాద్ జట్టు తరఫున వివిధ టోర్నమెంట్‌లలో పాల్గొని సత్తాచాటడంతో జాతీయ టీ 20 టోర్నీకి సెలక్ట్ అయ్యింది. వచ్చే నెల (జనవరి 2025) 5 నుంచి 12 వరకు గోవాలో నిర్వహించనున్న బీసీసీఐ అండర్–23 మహిళా టీ 20 క్రికెట్ పోటీల్లో హైదరాబాద్ జట్టు కెప్టెన్‌గా నల్ల క్రాంతిరెడ్డి సారధ్యం వహించనున్నడంతో కాంత్రిరెడ్డి తల్లిదండ్రులు నల్ల రామకృష్ణారెడ్డి, నల్లరాణి తోపాటు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నల్లక్రాంతిరెడ్డి ప్రస్తుతం నగరంలోని వనస్థలిపురంలో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటోంది.

## వినతిపత్రం అందజేత

**కీసర:** గోధుమకుంట గ్రామ మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం టీపీఎస్ కాలనీ వాసులు తమకాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కలిశారు. కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, సీసీ రోడ్లు తదితర సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలో కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని, అవసరమైన నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు జంగం శివయాదవ్, కాలనీవాసులు సోమయ్యగౌడ్, అశోక్‌యాదవ్, మురళీ, మధుసుధన్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, ఐలయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కలిసిన గోధుమకుంట టీపీఎస్ కాలనీ వాసులు తదితరులు

## ఘనంగా అమ్మవారి బోనాల పండుగ



ఆలయంలో చైర్‌పర్సన్ పావనీజంగయ్య, భక్తులు

**ఘట్‌కేసర్:** మున్సిపాలిటీలోని కొండాపూర్‌లో నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ అమ్మవారి బోనాల పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు, నైవేద్యం, ఒడిబియ్యం సమర్పించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో కౌన్సిలర్ మల్లేష్, కాంగ్రెస్ మున్సిపల్ ఉపాధ్యక్షుడు నాగరాజుముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులు, దేవేందర్ ముదిరాజ్, జంగయ్యాయాదవ్, శ్యామ్‌రావు, సునీల్, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్





గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ చైర్మన్ దయానంద్ అగర్వాల్, డైరెక్టర్లు అంజనికుమార్ అగర్వాల్, సంజయ్ అగర్వాల్, ప్రిన్సిపాల్ పరమశివన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

–మేడ్చల్